# అడివి బాపిరాజు తో



**మధుర:** అదేవిఁటీ, ఆ చేతులు తిప్పుకోవడం? దీన్నిబట్టి చూస్తే మిమ్మల్ని మీ సన్నిహిత మిత్రులు కోలవెన్ను రామకోటేశ్వర రావుగారు శ్రీమతి బాపిరాజు అని పిలిచేవారన్నది నిజమే కాబోలనిపిస్తుంది.

**బాపి:** అదా! ఓసారి మెద్రాసు రేడియోస్టేషన్నించి ''జీవితంలో సౌందర్యపిపాస'' అనే విషయాన్ని గురించి మాట్లాడా. ఆ టాక్ రికార్డ్ చేసినప్పుడు ఎదురు గుండా వున్నది మైక్రోఫోనే అయినా నా కదో అందమైన అమ్మాయిలా కనిపించింది. అప్పుడు రామకోటి అలా అన్నాడు. సాధారణంగా ఎవరిమీదా జోకులేవెయ్యని రామకోటేశ్వరరావుకి నేనంటే సరదా, చనువూ

**మధుర:** మీ చుట్టూ చేరినవాళ్లకి మీరంటే సరదా, చనువూకాక మరేమిటి? మిమ్మల్నందరూ బాపి బావ అనడంలోనే వుంది అదంతాన మీతో కలిసి తిరగడం ఓ వింత అనుభవం అని ఆచంట జానకి రామ్ అన్నారు

**బాపి:** వాళ్లందరూ అంటే అన్నారుగాని నువ్వుమాత్రం అనకు

**మధుర:** మా కందరూబావలే. జానకి రామ్‌గారు అందరిగురించీ అలా అన్లేదే!

**బాపి:** జానకిరామ్ గొప్ప సౌందర్య పిపాసి, అతనికి నా సుతిమెత్తని భావాల్తో బాటు నా నిత్యసహజ చేష్టలూ యిష్టమే

**మధుర:** మీరు ప్రతిమాటకీ ఆవేశమో ఉద్వేగమో చెందుతారని కూడా అన్నారాయన

**బాపి:** నాకు తెలీకుండానే ఒచ్చేవవి అందుకే నా బ్రతుకొక పరిమళార్ద్రనందనో ద్యానం అయిందని నా కనిపిస్తుంది

**మధుర:** అవును గానీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం వాళ్లు నవలల పోటీ పెట్టి ఒకటే బహుమతి అని ప్రకటించీ కూడా మీకూ విశ్వనాధ సత్యనారాయణ గారికీ చెరిసగం చేసి ఇచ్చేరట?

**బాపి:** ఔను ''వేయిపడగలు''కి అతనికి ''నారాయణ రావు''కి నాకూ.

**మధుర:** మీకేమీ మనస్పర్థలు రాలేదా, దానివల్ల?

**బాపి:** ఒస్తే అతనికి రావాలి గాని నాకెందుకొస్తుంది?

**మధుర:** తనతో సమానమైన ప్రతిభా అదృష్టం మరోరికి వుండవని ఆయన అనేవార్టగా?

**బాపి:** నాగురించి అలాటి అభిప్రాయమే ఉంటే నామీద అంత మంచి పద్యం ఎందుకు రాస్తాడు?

**మధుర:** ఏమిటో, ఆపద్యం?

**బాపి:** నువ్వు చదవకపోతే పోయేవు. నేను మాత్రం నాగురించి ఎవరేనా పొగుడుతూ రాసింది నానోటితో అన్ను.

**మధుర:** ఒట్టినే వెటకారానికన్నాన్లెండి ఆపద్యం నాకు కంఠతా వొచ్చు

అతడు గీసిన గీత బొమ్మై
అతడు పలికిన పలుకు పాటై
అతని హృదయములోని మెత్తన
అర్థవత్కృతియై - అని కదా; ఆయనన్నారు!

**బాపి:** నూటికి నూరు పాళ్లూ ప్రేమచేత అన్నవే ఆమాటలు.

**మధుర:** అలా ఆ బహుమతిని మీతో తప్ప ఇంకెవరితోనైనా పంపకం చేసుంటే గొడవ పెట్టేసుండేవాణ్ణి అనికూడా అన్నారాయన.

**బాపి:** అదీ ప్రేమ చేతనే

**మధుర:** 1895 లోపుట్టిన వారు మీతో బాటు కొందరు మహనీయులే అయ్యేరు

**బాపి:** మేమంతా మన్మథ నామ సంవత్సరంలో పుట్టాం.

**మధుర:** మన్మథనామ సంవత్సరంలో పుడితే అందగాళ్లు కావాలి గాని-

**బాపి:** అందగాళ్లమూ లేక పోలేదుగానీ, నీ మాటప్రకారం దుర్ముఖి నాకు సంవత్సరంలో పుట్టిన వాళ్లంతా ఏం కావాలి?

**మధుర:** కాలపురుషుడు ఉల్లాసంగా వున్నప్పుడు పుట్టి వుంటారు మీరందరూనూ మీ వంటివారు - అంటే కాటూరీ, విశ్వనాథా, జాషువా, మీరూ - అంతకి పూర్వం ఎప్పుడూ ఏకకాలంలో ఉద్భవించలేదు అదేమిటి, ఉన్నట్టుండి ఏదో పాట మొదలెడు తున్నారు?

**బాపి:** నువ్వూనేను కలసి ★ పువ్వులో తేనెలా
నువ్వూనేనూ కలసి ★ కోకిల గొంతులా, గొంతులో పాటలా
నువ్వూనేనూ కలసి ★ వెన్నెల వెలుగులా, వెలుగులో వాంఛలా
నువ్వూ నేనూ కలసి ★ గగన నీలానిలా, నీలాన శాంతిలా.

**మధుర:** ''నువ్వూనేనూ కలసి'' అంటూ తెగపలవరిస్తున్నారు

**బాపి:** నువ్వూనేనూ అంటే మనమిద్దరం కాదు

**మధుర:** తెలుసు లెండి ఆమె మీ ఊహాప్రేయసి శశికళ.

**బాపి:** కృష్ణశాస్త్రికి ఊర్వశిలా, నండూరికి ఎంకిలా-

**మధుర:** మీరేమో ఎవరైనా స్నేహితులిళ్లకి వెళితే తలసావిట్లో నిలవక తిన్నగా వంటింట్లోకి వెళ్లి వంటపనుల్లో కూడా సాయపడి చెయ్యిచేసుకునేవారట. మీ ప్రియురాలు అలకాపురవాసి కాదుగదా?

**బాపి:** భోగీర లోయ సహా చైత్యాల ప్రవాసి యైన శిల్ప సుందరిలో నే నామెనే పాడగన్నాను శిల్పాలు, చిత్ర లేఖనాలు, సంగీత సాహిత్యాలలో ఆమె విలాసాలనే తొంగిచూశా పురాస్మృతుల్ని రేపుతుందే కాని ఆ శశికళ దేవివలె నన్ను పల్కరించదు నేనెంత అలమటించినా, చీదరపడి శివమెత్తి ఆమె కోసం తిరిగినా చివరికి ''నీకు ఇవతలా, నాకు అవతలా తెర యున్నదె బాలా'' అని వాపోయా. ఈమే నాఊహా సుందరి ఆమె అభవ, ఆమె సద్యో యౌవన, ఆమె అయోనిజ, ఆమె ఎవరికీ ఎంత వలచినా గృహిణి కాదు

**మధుర:** అతీంద్రియ భోగ్యమైన వస్తువు ఆలింగమున యిముడునా? ఇమడదని రవి కవే అన్నాడు మీ కళాకారులందరిలో స్త్రీ ప్రకృతికెక్కువ పాళ్ళుంటాయి స్వామీ, మీకు వ్యవహార దక్షత కూడా తక్కువే నని కాటూరి వారన్నారు లాయరుగా, అధ్యాపకుడుగా, పత్రికా సంపాదకుడుగా దేంట్లోనూ మీరు దక్షుడనిపించుకోలేదట

**బాపి:** కళా సృష్టిలేని చోట నాహృదయం రపించదు.

**మధుర:** మీరు ప్రయోజకుడయితే మా బాపిరాజు, బాపిబావ కాకుండా పోయేవారు - కల్లాకపటం లేని పని వాని వంటి వారు మీ అమాయకత్వంతో మీరు లోకాన్ని జయించారు కర్మం చాలక ఎవరేనా వకాలతు ఇచ్చినా మీ[illegible] ముష్టి లక్ష్మీనారాయణ తోటలో పుష్ప జాతుల్ని గూర్చి చేతులు త్రిప్పుతూ ప్ర[illegible]ంగం చేస్తూ వుండేవారు ఎలాగో మిమ్మల్ని పట్టుకుని కోటూ పాగా తగిలించి కోర్టులో కూర్చోపెడితే మీ ముసిముసి నవ్వుల్ని చూసి మీ ప్రతిపక్ష వకీ లేదయినా అడిగేవాడు సబ్‌జడ్జి కూడా బాపిరాజు గారూ! ఎంత వరకు వచ్చింది మీ నవల అని అడిగే వాడు నవ్వుతూ ఇంట్లో వాళ్ళెవరికైనా సుస్తీ చేస్తే జేబులో డబ్బు వేసుకొని మందు కొనడానికి బజారు కెళ్ళిన మీరు ఆ సొమ్ముతో ఏనక్కపల్లి బొమ్మలో, కాళహస్తి కంచు విగ్రహమో కొనుక్కొచ్చేసేవారు ఆ బొమ్మల పని తనం గురించీ ప్రాశస్త్యం గురించి లెక్చర్ లిచ్చేవారు ఆలివర్ గోల్డ్‌స్మిత్తు మళ్లీ మీలా అవతరించాడని అంతా అనుకునేవారట ఈ మాత్రం ఆమాత్రం తీరుబాటుంటే చిన్నపిల్లాడిలా

**బాపి:** నేను పిల్లల ప్రపంచంలో యిట్టే యిమిడి పోతాను నాకు పిల్లల పోషణ వగైరాల న్నీవచ్చు, ఎలాటి మకురు బిడ్డ కానీ నా బుజాల మీదకు పాకవలసిందే, నేను వారితో ఆడతా, పాడతా-

**మధుర:** మీరు పసి వారు కాబట్టే పసి వాళ్ళతో యిట్టే కలిసిపోయేవారని మీబంధువులనేవారు

**బాపి:** పిల్లలకు వలెనే నాకు కొత్త వాళ్ళుంటే కాస్త బెరుకు, చప్పున కలవలేను ఎందుకో,

**మధుర:** మీలాంటి పండితులు అలా ప్రవర్తించరు

**బాపి:** నా పాండిత్యం అంతా గురుముఖతా నేర్చుకున్నది కాదు

**మధుర:** సభలలో రక్తి తగ్గినపుడు పిలవండి బాపిరాజును అనే వారట గదా! అప్పుడు మీరు ''గవళ్ళ సెల్లాయి కూతురు కడు చక్కనిదని సూతురు!'' అని ఎత్తుకుంటే అంతా ముసి ముసి నవ్వులేట! అవును ఇంతకీ మీ గురువు గారు ఎవరు?

**బాపి:** ప్రమోద కుమార చటర్జీ వారికి ముందు రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ కూట్రే దొరగారు పూర్తిపేరు ఆస్వాల్డ్ జెన్నింగ్స్ కూట్రే.

**మధుర:** అవును; మిమ్మల్ని కులపతి అడివి బాపిరాజు గారని పిలుస్తారే, కులపతి అంటే యిటీవల ఎన్.టి. ఆర్ గారు సాధించిన కులపతి కాదు గదా, కొంపదీసి?

**బాపి:** సాహిత్యం, చిత్రలేఖనం, శిల్పం, సంగీతం, నాట్యం యీ అయిదు కళలు ఎంతి సన్నిహితమైన వంటే పంచనదీ పరివేష్టిత మైన పంజాబు వంటిది కళ ఆ వాసనలు గలవాళ్లని ''కులపతులు'' అనవచ్చు (ప్రొఫెసర్, ఆచార్య, ప్రాచార్య - ఇలా చాలా పేర్లతో పిలవ్వచ్చు)

**మధుర:** కోనంగి నవలలోని కొంటె కోనంగి మీరేనటగా! మీ హాస్యానికి ఆంధ్ర దేశమంతా వేదికటకదా?

**బాపి:** ''కోనంగి'' లో కొంత స్వానుభవం కూడా వున్నదనుకో

**మధుర:** కవులు మీరు చిత్రకారుడనీ చిత్రకారులు మీరు కవి అనీ మీకు రావలసిన కీర్తి దక్కకుండా చేసే వారట, ఎంత వరకు నిజం?

**బాపి:** అది ఒక చమత్కారం, అంతే శశిని ఒక తల్లికీ మరో తల్లికి కళనూ పంచియిస్తానని అన్నా చంద్రుడు కవిత్వానికి అధిపతి, వెన్నెలంతా కవిత్వమే సూర్యుడు వర్ణపతి చిత్రలేఖనానికి అధిపతి

**మధుర:** బావుంది ఒకరికి కాళ్లు ఇచ్చాను ఒకరికి చేతులు ఇచ్చాను అన్నట్టుగా సూర్యుడ్ని ఒకరికీ చంద్రుడ్ని ఒకరికీ యిచ్చారన్నమాట. అయితే శశికళను భువి నుండి దివికి పంపారు గాని అక్కడిది యిక్కడకు తేలేదన్న మాట

**బాపి:** నా భార్యకు చిన్నప్పుడే నెర్వస్ బ్రేక్‌డవున్ వల్ల కదల లేని స్థితి. నన్నెప్పుడూ తన దగ్గర చూచోమని అడిగేది మా పెద్ద మ్మాయి రాధావసంతకి పోలియో వచ్చి చిన్నతనంలో నడక పోయింది అయినా ఆపిల్లకు కావలసిన ఆత్మశక్తిని సమకూర్చా

**మధుర:** పిల్లల్ని కనడం ఒక్కటి చేతగాదు కాని మీరు ముమ్మూర్తులా స్త్రీయేనని అనేవారట కాటూరి వెంటేశ్వరరావుగారు. మీ నోట్స్లో ఆడ వాళ్ళకి మల్లే నువ్వు గింజ నానదట. ' ఎండిమియాన్' కథేమిటి స్వామీ!

**బాపి:** ఆస్వాల్డ్‌కూల్డ్రే గారితో అజంతా, ఎల్లోరా గుహలూ అవీ తిరిగి తిరిగి ప్రకృతి. సౌందర్యం వెల్లి గొన్న తావేదో వెతుకులాడాను ఆ అన్వేషణలో ఒకరాత్రి పాపి కొండల మీద ఒక అడివిలో చిక్కడ్డాము అక్కడ అన్నీ లతానికుంజాలే, పారే సెలయేళ్ళ పక్కన తల లూపుతున్న ఎత్తయిన ఒత్తయిన చెట్లు, అక్కడక్కడా రాతి బండలు, వాటి మీద ప్రతిఫలించే పండు వెన్నెల, అలసి సొలసి నేను అల్లంత దూరాన ఓ రాతిబండ మీద మేను వాల్చి చల్ల గాలికి నిద్రలోకి జారానట తర్వాత చెప్పారు అప్పుడు కూల్డ్రేదొరగారు ఒక అద్భుతమైన దృశ్యం చూశారట ఆ వెన్నెల అంతా ఒక స్త్రీ మూర్తిలా రూపుగొని నామీద వాలిపోయిందట. ఆదృశ్యాన్ని కూల్డ్రే దొరగారు బొమ్మకెక్కించి నాకు బహూకరించారు. అదే 'ఎండిమియాన్'

**మధుర:** దాని మీద మీరో చక్కటి పాటరాసేరట గాని నాకది రాదు

**బాపి:** చంద్రలోకం తూర్పుదెసలో
సూర్యలోకం పశ్చిమంలో
చిన్నిలోకం ఒకటి ఉన్నాదే
ఓనా వెన్నెలా చిన్నారి పడుచా
ఆలోకమేలే కన్నెరాశివి
నువ్వే నువ్వేనే

ఆమే శశికళ...... ఇంకా చాలా ఉంది.

**మధుర:** తెలుగు భాషకు ఆ భాషా మాధుర్యానికి చక్కగా సేవచేసిన షట్చక్రవర్తులు ఎవరు అనే ప్రశ్నవస్తే చిలకమర్తిలక్ష్మీనరసింహం, శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి విశ్వనాథ సత్యనారాయణ, నోరి నరసింహశాస్త్రి, అడివి బాపిరాజు, మల్లాది రామకృష్ణశాస్త్రి అంటారు. మీ వేషం చాలా చిత్రంగా ఉండేదిట?

**బాపి:** ఏంవుంది! ఖద్దరు పంచె, ఖద్దరు లాల్చీ, పైన ఉత్తరీయం, దువ్వని శిరోజాలు, కాళ్లకు బందరు చెప్పులు - యిదీ నా వాలకం

**మధుర:** స్వాతంత్ర్యోద్యమంలో కారాగార క్లేశం అనుభవించారట గదా! మీకెవరైనా మిత్రులు డబ్బిస్తే, దాన్ని ఎదురైన కుచేల మిత్రుల చేతుల్లో పెట్టి నిర్విచారంగా యింటికి వచ్చేవారట. నాటి తెలుగు సాహితీ వనంలో మీరో రసాల వృక్షంలా నిలబడి అన్నివైపులకు చేతులు సాచారు. మీకు స్వర్ణాభిషేకం జరిగిందిట! 'నాకు గురుత్వం వహించిన నా శిష్యు'లని కూర్ద్రే దొరగారు ఒక పుస్తకాన్ని మీకు అంకితం చేశారట. ఎంత అదృష్టం? మీరూ విశ్వనాథ వారూ సూర్య చంద్రుల వంటి వారు తెలుగు సాహిత్యాభిమానులకు

**బాపి:** పూర్వ కవుల ఆఖరు కాపుశ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి. నవ్య కవుల ప్రథమ సంతానం రాయప్రోలు సుబ్బారావు, ఆ తర్వాత శ్రీశ్రీ నవ్య కవిత్వంలో వంకరకొమ్మ

**మధుర:** హైదరాబాద్‌లో మీజాన్ పత్రిక నడిపే వారట, ఒక రకంగా పత్రికల్లో సీరియల్ నవలా రచనకు ఆద్యులు మీరేనట, మీజాన్‌లో సినిమా కాలం ప్రవేశపెట్టింది మీరేనటగా.

ఆ కాశ మల్లెదీవి
ఆ మల్లెపూల తావి
అల్లడుగో బావ చూడు
అల్లారు ముద్దుబావ, అడివి బాపిబావ.

**బాపి:** ఖాన్ బహదూర్ అహ్మద్ నవాజ్ జంగు అల్లుడైన గులాం మహ్మద్ కలకత్తా వాలా 'మీజాన్' పేరుతో మూడు పత్రికలు పెట్టాడు. ఇంగ్లీషు, ఉరుదూ, తెలుగూ. మూడూ మూడు విధానాలు. తెలుగు మీజాన్ మాత్రం నిజాం వ్యతిరేక శక్తులను సమర్థించేది. ఆంధ్ర మహా సభను సమర్థించేది. ఓ మాటు శివశంకర స్వామి గారు మా ఆఫీసు కొచ్చిచూసి యిలాటి వాళ్ళను పెట్టుకున్నావేమిటోయ్ అని గట్టిగా విమర్శించారు. నేను మా సిబ్బందిని సమర్థించాలి గదా. ఇలా అన్నా, వీణ ఎలా వుంటుంది? ఒక తీగషడ్జమం

పలుకుతుంది, మరొకటి రిష భం పలుకుతుంది. ఇంకొకటి గాంధారం, నాల్గోది దైవతం, మరొకటి మధ్యమం, ఆరవది నిషాదం. ఏడవది పంచమం, సరిగమపదని, ఈ వరుసలో సప్తస్వరాలు పలికితేనే వీణ, కనుకనే సప్త తంత్రి అన్నారు దానిని, నాస్టాఫ్ కూడా వీణ వంటి వారు. అంతా కలిసి పత్రికను తయారు చేసేవారు నా కిష్టమైనవే వుండాలి తక్కినవి వద్దు అంటే ఎలా?

**మధుర:** మీరు మీ స్టాఫ్‌ను సమర్థించిన వైనం అమోఘం. ''ఓ పలనాటి ఎలమందా, పలవరిస్తావా జైలు కొట్టల్లో!'' అని పాడితే పరిసరాలన్నీ మారుమ్రోగేవిట. అలాగే ''లేపాక్షి బసవయ్యా లేచి రావయ్యా!'' అని పాడితే జనాలు ఉర్రూతలూగే వారట కదా! ఒకసారి అడివి బాపిరాజు గాంధీజీ వంటివాడు అని పడటానికి బదులు 'గాంధీజీ వంట వాడు' అని పడిందట ఓ పత్రికలో, నిజమేనా?

**బాపి:** నేను నిజంగా మంచి వంటవాడినే.

**మధుర:** అన్నట్లు మీరు వ్రాసిన '' ఉప్పొంగిపోయింది గోదావరీ, తాను తెప్పున్న ఎగసింది గోదావరీ'', అందరికీ వచ్చు

**బాపి:** ఓ మాటు మా అమ్మజైల్లో వున్న నన్ను చూడ్డానికి వచ్చి కంట తడిపెట్టింది.

**మధుర:** అప్పుడు మీరు చెప్పిన గేయం - 'కటకటాల చేయిచాచి, కౌగలించి బొజ్జతడుము అమ్మచేయి అమృత రేఖ, అమ్మ ప్రేమ ఆర్ణవమే' నన్నారు నాకు గుర్తు మీ భార్య జైల్లో మిమ్మల్ని చూడ్డానికి ఖద్దరు చీరె కట్టుకు రాలేదని మీరామెతో మాట్లాడలేదట, పాపం

**బాపి:** అప్పుడు మా ఆలోచనల ధోరణులూ విలువలూ అలావుండేవి తెలుగు వారికి నేటికీ తెలుగు వారి మీదా, తెలుగు తనం మీదా అభిమానం లేదని చాలా ఆవేదనపడ్డా.

'తెలుగు తనము జారిపోయిన
తెలివి మాలిన తెలుగువాడా
పేరు మార్చుకు దారి నడువుమురా
నీ దారిలోనే ఊరిపోవుమురా' అనిరాశా

**మధుర:** మీగేయం 'డూడూ బసవన్నా' కూడా పాప్యుల రేనటగా

**బాపి:** మా ప్రిన్సిపాల్ కూల్‌డ్రేగారు ఆ పాట చదివించుకుని అలాటి దృశ్యం ఉంటుందా అని ఆశ్చర్యపడ్డారు ఆ మరుసటేడు సంక్రాంతికి ఆయన్ని ఓ పల్లెటూరికి తీసికెళ్లి గంగిరెద్దుని చూపించేం దాన్ని ఆయన ఓ బొమ్మ వేసి నాకు బహూకరించేరు

**మధుర:** ఏమిచిత్రం? సంక్రాంతికి బొమ్మ వేస్తే జూన్ 30 నాడు సంతకం పెట్టేరా?

**బాపి:** అప్పుడు అంతే వేసిన బొమ్మలో పెర్‌ఫెక్షన్ వచ్చేదాకా చూపించేవారు కాదు. ఆ బొమ్మ చూస్తే దాంట్లో పెర్‌ఫెక్షన్ నీకు తెలిసేది.

**మధుర:** మీరు జైల్లో ఉన్నప్పుడు బోలెడు పెన్సిల్ స్కెచ్చిలు వేసేవారటగా?

**బాపి:** పెన్సిల్ స్కెచ్చిలు కాకపోతే ఆయిల్ పెయింటింగ్స్ వెయ్యడానికి వీలేది? ఉన్నదే

జైలాయెను అవన్నీ జ్ఞాపకాల్లోంచి వచ్చినవి. ద్వారం వెంకట స్వామి నాయుడు గారి వయోలిన్ కచ్చేరీ, రామప్పదేవాలయంలో నాగినీ నృత్యం, సాలార్‌జంగ్ మ్యూజియంలో నవాబుల హుక్కా- ఇలా చాలా ఉన్నాయి నా పెనసులు స్కెచ్‌లు కూడా చాలా పేరు పొందాయి

**మధుర:** చిత్రకారుల్లో కూడా మీ సమకాలికులు గొప్పవాళ్లు పుట్టేరు

**బాపి:** దామెర్ల రామారావుగారు, కవి కొండల వెంకటరావు గారు నా సతీర్థులు

**మధుర:** మీ వర్ణ చిత్రాలన్నీ తెలుగువాళ్లు దాచేరా?

**బాపి:** నా కళాసృష్టిలో ఆ భాగం సరైన ప్రాచుర్యానికి నోచుకోలేదు బందరు జాతీయకళాశాలలో రెండు, విశాఖపట్నం మ్యూజియంలో కొన్ని; చితికి పోయిన సంస్థానాల్లో కొన్ని- ఇలా ఎక్కడెక్కడికో చేరిపోయాయి నా శబ్ద బ్రహ్మ చిత్రం డెన్మార్క్ చిత్ర ప్రదర్శన శాలలోవుంది

**మధుర:** ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తెలుగువాళ్లని హీనంగా చూసే వారని కవితలు రాసేరుటగా

**బాపి:** నిజంగానే తెలుగు వాళ్లని అణగదొక్కేవాళ్లు. అది చరిత్రలో లేనప్పుడు కవిత్వంలోనైనా ఉండాలి కదా అని రాశాను

**మధుర:** ఆంధ్రుల ప్రతిభ ఆంధ్రుల కీర్తి
ఆఖరు కాదని ఆరిపోవదని
మోగింపమ్మా జయజయఢం కా
తెలుగుగానమూ, తెలుగు నాట్యమూ
తెలుగురంగులూ, తెలుగు తేనెలూ
ఆగిపోవనీ అందం వీడదని
రూపంచెడదనీ, రుచులు తగ్గవనీ
మోగింపమ్మా జయజయఢంకా

**బాపి:** ఇది కూడా నేను రాసిందే;

**మధుర:** రాయడమేమిటి, పాడేవారుటగా, కాని, దీంట్లోనూ, ''జ్యోతిర్మయి ఆంధ్రీ'' లాంటి పాటల్లోనూ మిగిలిన భాషల వాళ్ల మీద ఆగ్రహం లేదు

**బాపి:** మహాత్మాగాంధీ గురించి రాసిన పాటల్లో కూడా ఇంగ్లీషు వాళ్లమీద ఆగ్రహం లేదు

**మధుర:** ఆ పాటలన్నీ భావనాశక్తివల్ల బలికేయి. విశ్వనాథ వారు మీతో 'బావా నీకున్నంత భావనాశక్తి నాకు లేదోయి! నాకున్న భాషా పాటవము నీకు లేదు!' అంటే మీరు నవ్వేసేవారట విచారించ కుండా యితరులు చెప్పేది నమ్మటం అనే లక్షణం మీలో ఉండేదట. విశ్వనాథ వారికీ మీకూ తేడాలు యిందువల్లే వచ్చాయట.

**బాపి:** ఇదేమిటోయి అని వారనగానే నవ్వేసి మర్చిపోయేవాడిని. 1935 నుంచి 39వరకూ

బందరు జాతీయ కళాశాల ప్రిన్సిపాలుగా వుండి దాని అభివృద్ధికి. చాలా పనిచేశాను అప్పుడు కాటూరి వెంకటేశ్వరరావు తెలుగు అధ్యాపకుడు, మా యిద్దరి కలయిక ప్రకృతి పురుషుల కలయిక వలె వుండేది మాకు 'ముట్నూరి' వారు గురుదేవులు.

**మధుర:** మీ ఇంటి పేరు 'అడివి' అయినా మీ సాహిత్యం నందనవనం మీతో కలిసి నవ్య సాహిత్యంలో బసవరాజు, బాపిరాజు, నండూరి సుబ్బారావు గారలు గేయ కవిత్రయం

**బాపి:** నా గేయాలింకా అముద్రితంగా వున్నాయి. 'Poems' అనే నా ముచ్చటైన నోట్ బుక్ అవన్నీ రాధా వసంత వద్ద ఉన్నాయి నేను 'మధురవాణి' అనే నవల రాశా తంజావూరు నాయక రాజుల్లో ప్రముఖుడైన రఘునాథ నాయకుని ఊరేగింపుతో యీ నవల ప్రారంభం అవుతుంది. కథంతా రఘునాథ నాయకుడు మధురవాణిల చుట్టూ తిరుగుతుంది

**మధుర:** పోన్లెండి నా పేరు అట్టమీద వేయించేరు; థాంక్స్. మరి త్రివేణికి సహాయ సంపాదకుడుగా కొన్నాళ్ళు పనిచేశారట సతీ అనసూయ - ధ్రువ విజయం (1935) మీరా బాయి (1940) కళాదర్శకత్వం వహించారట, మీకు చిత్రకళ పిలిస్తే పలికే దివ్య శక్తి వుందని గూడూరి నమశ్శివాయ అనేవాడు. ముట్నూరు కృష్ణారావుగారు మీ కళాతృష్ణను చూసి మీకు 'కులపతి' అనే బిరుదు యిచ్చారట! ఆంధ్ర జాతీయ కళాశాలను ఆదర్శవంతమైన గురుకులంగా తీర్చిదిద్దారుట. కాని మీ ఆఖరి రోజుల్లో ఆర్థికమైన యిబ్బందులు ఎదుర్కొన్నారట.

**బాపి:** లేదు, ప్రొస్ట్రేట్కీమీ ఆపరేషన్ కోసం రాయపేట హాస్పిటల్‌లో ఎడ్మిట్‌కాగానే మా తమ్ముడు అడివి సత్యనారాయణ కొంత డబ్బుతో మద్రాసుకు వచ్చి నా దగ్గరే వున్నాడు డాక్టర్ ఎ యస్ రామకృష్ణ ఆపరేషన్ చేస్తే నా మేనల్లుడు, డాక్టరు బుద్ధవరపు కృష్ణారావు డాక్టరు గోవిందరాజుల సుబ్బారావు తోడు వున్నారు పూర్తి ఆరోగ్యం వచ్చింది నారాయణరావు నవల ప్రూపులు అక్కడే దిద్దేను ఆ నవల ద్వారా వచ్చిన డబ్బుతో నా ఆఖరి రోజులు నిశ్చింతగా ప్రశాంతంగా గడిచాయి నేనెవరికీ బాకీలు పెట్టలేదు

**మధుర:** మిమ్మల్ని గుర్తుంచు కోకపోవడం, మిమ్మల్ని మరిచి పోయినట్లు వటించడం మీ ఆర్ట్ ఆల్బములు కూడా ఎవరూ ప్రకటించక పోవడం, చాలా దౌర్భాగ్యం మీ శతజయంతికైనా ఎవరో ప్రచురిస్తారేమో లెండి

**బాపి:** (అదేమీ పట్టించుకోకుండా) నువ్వటే, నువ్వటే
పువ్వు వంటి వయసు
నవ్వులాంటి సొగసు
రువ్వి నాయెదపైన
పర్వులెత్తావటే (అని పాడుకుంటూ నిష్క్రమణ)

★

*(మిసిమి - జూన్, 1996)*